సాక్షి
నల్లగొండ
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ఐకేపీ సిబ్బంది నిర్బంధం

మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో మహిళలు సోమవారం ఐకేపీ సిబ్బందిని నిర్బంధించారు. - 8లో



సూర్యాపేటలో యోగా పోటీలు

మార్చి 2న సూర్యాపేటలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు యోగా గురువు పాపిరెడ్డి తెలిపారు.- 8లో



వైభవంగా నిర్వహించాలి

మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ సూచించారు.- 8లో

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. పోలీస్ గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులను ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. డయల్ యువర్ సైబర్ నేస్తం కార్యక్రమానికి పలువురు బాధితులు ఫోన్ చేసి వారి సమస్యను తెలియజేశారు. ప్రతి సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు సైబర్ బాధితుల కొరకు డయల్ యువర్ సైబర్ నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. బాధితులు 8712658079 ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు 'స్వావలంబన్'

నల్లగొండ : సదరం సర్టిఫికెట్ల జారీకి స్వావలంబన్ సైట్ అందుబాటులోకి వచ్చిందని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగులు www.swavlambancard.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలు సొంతంగా లేదా మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరికి నల్లగొండ జీజీహెచ్‌లో నిర్ధారణ పరీక్ష వైకల్య ధ్రువీకరణ కార్డులు పోస్టు ద్వారా పంపుతామని తెలి పారు. మీసేవలో నమోదు చేసుకున్న వారికి యూడీఐడీ ద్వారానే సర్టిఫికెట్లు జారీ అవుతాయని పేర్కొన్నారు. వివరాల నమోదులో పేరు, తండ్రి పేరు, నివాసం, పుట్టిన తేదీలు తప్పులు లేకుండా చేసుకోవాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన బెల్లి యాదయ్య



అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ తెలుగు శాఖకి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ బెల్లి యాదయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లి యాదయ్య ప్రస్తుతం నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. బాధ్యతలు స్వీకరించిన యాదయ్యకు ఎం రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ డీన్ కొప్పుల అంజిరెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షురాలు అరుణప్రియ, జి.నర్సింహ, ఎం .సత్యనారాయణరెడ్డి, అనితకుమారి ఉన్నారు.



లింగమంతుల స్వామి ఆలయ పరిసరాల్లో దుకాణాలు, భక్తుల గుడారాలు





దారులన్నీ గట్టువైపే..

లింగమంతుల స్వామి జాతరకు పోటెత్తిన భక్తులు

- లక్షలాదిగా తరలివచ్చిన జనం
- ఓ లింగా నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు
- రెండవ రోజు ప్రత్యేకంగా సాగిన బోనాల సమర్పణ
- పూజల్లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్



లింగమంతుల స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తజనం



స్వామివారి సన్నిధిలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట, చివ్వెంల,సూర్యాపేటటౌన్, భానుపురి: చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతర రెండవ రోజు సోమవారం జనగట్టును తలపించింది. తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. రెండవ రోజు చౌడమ్మ బోనాలు సమర్పించారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి చౌడమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. స్వామి వారిని సోమవారం ఒక్కరోజే 6 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు అంచనా.

బోనాల సమర్పణ సాగిందిలా..

మున్న (రాజులు) మెంతబోయిన (పూజారులు) తమ ఇళ్ల నుంచి తెచ్చిన బియ్యంతో రెండు బోనాలు వండి స్వామి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించడం ఈ జాతరలో ప్రత్యేకత. తొలుత మున్నవారు రాశిబోనం, తర్వాత మెంతబోయిన వారు సందవసర బోనం సమర్పించారు. ఇరు బోనాల నుంచి కొంత అన్నం తీసి లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తొలిగొర్రె (మెంతబోయిన వారిది), బద్దెపాల గొర్రె (మున్న వారిది), వరద గొర్రె (గొర్ల వారిది)లను చౌడమ్మ తల్లికి ఎదురుగా బలిచ్చారు. ఆ మాంసాన్ని మున్న, మెంతబోయిన, బైకానివారు వాటాలుగా పంచుకుని వండి చౌడమ్మకు నైవేద్యం సమర్పించారు.

లింగమయ్య పూజల్లో ప్రముఖులు

లింగమంతుల స్వామిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి, కలెక్టర్ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు.

నేడు చంద్రపట్నం

జాతరలో మూడవ రోజు మంగళవారం చంద్రపట్నం వేసి స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు దేవాలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.



భేరీలు మోగిస్తున్న మహిళలు



స్వామివారి దర్శనానికి గట్టుపైకి వెళ్తున్న భక్తులు



ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి కారణంగా రెండు వారాలపాటు నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ సోమవారం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజావాణిలో వ్యక్తిగత సమస్యలు, భూములకు సంబంధించిన విషయాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ పథకాల కింద చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ప్రతిపాదనలు

గ్రామాల సందర్శన సందర్భంగా పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన అత్యవసర పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుణాత్మక విద్య అందేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి పాల్గొన్నారు.

● ఘనంగా కేసీఆర్ జన్మదినం



మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం నల్లగొండలోని మెడికల్ కాలేజీ వద్ద కేక్ కట్ చేసి.. నాయకులకు తినిపిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నాయకులు

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



మిర్యాలగూడ డిపోలో ఆర్టీసీ బస్సులు

మిర్యాలగూడ టౌన్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నల్లగొండ రీజియన్ పరిధిలోని యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, దేవరకొండ డిపోల నుంచి పలు శివాలయాలకు 70 బస్సులను నడిపించనున్నారు. ప్రధానంగా శ్రీశైలం , మేళ్లచెరువు, సత్రశాల, వాడపల్లి, సోమప్ప దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సుల వివరాలు ఇలా..

- మిర్యాలగూడ డిపో నుంచి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమప్ప దేవాలయానికి 5, అడవిదేవులపల్లిలోని సత్రశాలకు 5, వాడపల్లికి 5 బస్సులను నడిపించనున్నారు.
- కోదాడ డిపో నుంచి మేళ్లచెర్వుకు 30 బస్సులు నడపనున్నారు.
- దేవరకొండ డిపో నుంచి డిండి మీదుగా శ్రీశైలానికి 25 ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు అన్నీ ఏర్పాట్లను చేపట్టారు.

భక్తుల రద్దీని బట్టి ఆయా పుణ్యక్షేత్రాలకు అదనపు బస్సులు నడిపించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

చూపించిన చోటే ఇల్లు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిబంధన
- సర్వే సమయంలో చూపిన స్థలంలోనే నిర్మిస్తేనే బిల్లు
- జియో ఫెన్సింగ్ విధానం ద్వారా అనుమతులు
- ఉమ్మడి జిల్లాలో 42 వేల ఇళ్లు మంజూరు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సర్వే సమయంలో చూపించిన స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అప్పుడు చూపించిన ప్లాటు కాకుండా వేరే చోట్ల ఇల్లు నిర్మించేందుకు సిద్ధమైతే.. రద్దు చేయనున్నారు. ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలని.. జియో పెన్సింగ్ విధానాన్ని అమలు చేయాలని.. అప్పుడే నిధులిస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాయంతో ప్రత్యేక యాప్‌ను తయారు చేసింది. ఆ యాప్ ద్వారా గతంలో సర్వే చేసిన ఇంటి స్థలంలోనే ఇల్లు కట్టేందుకు అనుమతినిస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు తావుండదు.

జియో పెన్సింగ్ విధానం అమలు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 చొప్పున ఉమ్మడి జిల్లాకు 42 వేల ఇళ్లను మంజూరు చేసింది. ఇందు కోసం ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించి.. ఇంటింటి సర్వే పూర్తి చేసింది. సర్వే సందర్భంగా ప్రస్తుతం నివాసం ఉండే ఇల్లు, ఇంటి స్థలం, డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. సొంత జాగా ఉన్న పేదల జాబితాను సిద్ధం చేశారు. ఇల్లు మంజూరైన వారు సర్వే సమయంలో చూపించిన స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. జియో పెన్సింగ్ విధానం ద్వారా అనుమతి ఇస్తుండడంతో.. అక్కడే ముగ్గు పోయాల్సి ఉంటుంది. ముగ్గు పోసే సమయంలో గ్రామ కార్యదర్శి, వార్డు అధికారికి సమాచారం ఇస్తారు. సర్వే సమయంలో చూపిన స్థలం అదేనా కాదా అని వారు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రత్యేక యాప్‌లో స్థలం వివరాలు, అక్షాంశ, రేఖాంశాల వివరాలతో జియో పెన్సింగ్ చేస్తారు. అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు ఆ స్థలం వద్ద ఉండి యాప్ ద్వారా పరిశీలిస్తారు. సర్వే సమయంలో ఇచ్చిన వివరాలు పరిపోలితేనే.. లబ్ధిదారుల ఫొటోలు, వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అవుతాయి.. తప్పుడు సమాచారం ఇస్తే యాప్ తీసుకోదు.


అక్రమాలకు అడ్డుకట్ట..

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చే జియో పెన్సింగ్ విధానం ద్వారా పాత ఇళ్లను చూపి గతంలో మాదిరిగా అక్రమాలకు పాల్పడే అవకాశం ఉండదు. గతంలో ఒకరికి మంజూరైతే.. మరొకరు నిర్మించుకోవడం, చూపించిన చోట గాకుండా మరోచోట నిర్మాణాలు చేసుకోవడం వంటివి జరిగేవి. కొత్త విధానంతో వాటికి చెక్ పడనుంది.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నల్లగొండ : రెడ్డీస్ ఫౌండేషన్ గ్రో ప్రోగ్రాం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు కంప్యూటర్ ఆపరేటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలల శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు అల్మాస్ ఫర్హీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అర్హతలు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులను గడియారం సెంటర్‌లో ఉన్న తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 70326 09925, 91777 85983 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పెద్దగట్టు సిత్రాలు



పెద్దగట్టు జాతరలో లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు



నృత్యాలు చేస్తున్న శివసత్తులు





పెద్దగట్టుకు గంపలు ఎత్తుకొని భేరీలు మోగిస్తూ వస్తున్న భక్తులు



మకర తోరణాలు తీసుకొస్తున్న భక్తులు



దేవరపెట్టెను తీసుకొస్తున్న భక్తులు



విద్యుత్ కాంతుల వెలుగుల్లో పెద్దగట్టు ఆలయ పరిసరాలు



దేవరపెట్టెకు పూజలు చేస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ దంపతులు



దేవరపెట్టెకు పూజలు చేస్తున్న యాదవ పూజారులు



బండపై నైవేద్యం పోసి ఆరగిస్తున్న మెంతబోయిన వంశస్తులు



చిలకమ్మా.. చెప్పమ్మా : జాతరలో చిలుక జోస్యం చెప్పించుకుంటున్న మహిళలు



చేతిపై చెరగని ముద్ర : పచ్చబొట్టు వేయించుకుంటున్న మహిళలు



ఎప్పటికీ గుర్తుండిపోయేలా.. జాతరలో ఫొటో తీయించుకుంటున్న కుటుంబ సభ్యులు



భేరీలు మోగిస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



లింగమంతుల స్వామిని దర్శించుకున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఫొటోలు : అనమాల యాకయ్య, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

మద్యం వద్దు.. ఆరోగ్యమే ముద్దు

సూర్యాపేట: మద్యం వద్దు.. ఆరోగ్యమే ముద్దు అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతరలో సోమవారం అవగాహన కల్పించారు. మద్దిరాల మండలం గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ మద్యపానం వలన అనేక నష్టాలు కలుగుతాయని జాతరలో ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నల్లటి దుస్తులు ధరించి అవగాహన కల్పించారు.



మద్యం తాగొద్దని ఎక్సైజ్ పోలీసులతో కలిసి ప్రచారం చేస్తున్న ప్రభాకర్

మార్మోగిన ఓ లింగా.. నామస్మరణ

- పెద్దగట్టుకు భారీగా తరలివచ్చిన భక్త జనం

సూర్యాపేట, చివ్వెంల, సూర్యాపేటటౌన్, భానుపురి, పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరైన దురాజ్‌పల్లి లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు రెండో రోజు సోమవారం భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. తమ ఇష్టదైవం లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి సందడి చేశారు.

ఎర్రబడ్డ పెద్దగట్టు

భక్తులు యాటలను బలి ఇవ్వడంతో పెద్దగట్టు ఎర్రబడింది. యాదవులు స్వామివారికి కొబ్బరికాయలు, బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకోగా, అమ్మవారికి యాటలను బలి ఇచ్చారు. గతంలో గట్టుకు ఒకవైపు కేటాయించిన ప్రదేశంలో మాత్రమే యాటలను బలి ఇచ్చేవారు. కానీ ఈసారి భక్తులు తమకు నచ్చిన చోట గుట్ట చుట్టూ యాటలను బలి ఇచ్చారు. దీంతో యాటల రక్తంతో గుట్ట ఎర్రబడింది. జాతరలో రెండు రోజుల్లో తప్పిపోయిన 25 మంది చిన్న పిల్లలను శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు.



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

వెలవెలబోయిన కోనేరు

గుట్ట పైన కోనేరులో భక్తులు స్నానాలను ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు గుట్ట పైన ఉన్న కోనేరు ఏమాత్రం సరిపోవడం లేదని భావించి గుట్ట కింద గతంలోనే కోనేరును నిర్మించారు. అయితే కోనేరులో స్నానాలు చేసే సమయంలో భక్తులకు ఏమైనా జరుగుతుందన్న ముందస్తు చర్యలో భాగంగా ఈ కోనేరుకు తాళాలు వేశారు. దీంతో కోనేరు వెలవెలబోయింది.

ఆకట్టుకున్న శివసత్తుల నృత్యాలు

లింగమంతుల జాతరలో శివసత్తులు సందడి చేశారు. లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లికి బోనం సమర్పించేందుకు భక్తులు గంపలతో వచ్చే సమయంలో శివసత్తులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

పనిచేయని షవర్లు

లింగమంతులస్వామి వారిని దర్శించుకునే ముందు భక్తులు స్నానాలు చేసేందుకు వీలుగా గుట్ట పైన ఏర్పాటు చేసిన షవర్లు పనిచేయకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిల వద్దనే భక్తులు స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వెళ్లారు. పెద్దగట్టు జాతరలో అంటువ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. జాతరకు వచ్చిన భక్తులు వదిలేసిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు సేకరించి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

కేరాఫ్ అడ్రస్ మర్రిచెట్టు

జాతరకు వచ్చే భక్తులకు కేరాఫ్ అడ్రస్‌గా మర్రిచెట్టు నిలిచింది. ప్రధాన ద్వారం, గట్టు పైకి వెళ్లే వారు మర్రిచెట్టు నీడలో భక్తులు సేద తీరారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సైతం ఇక్కడి నుంచి జాతరను పర్యవేక్షించారు. తప్పిపోయిన వారిని గుర్తించడం, వివిధ శాఖల అధికారులు సైతం ఇక్కడికే వచ్చి కలుసుకోవడం గమనార్హం. జాతరలో తప్పిపోయిన వారికోసం మర్రిచెట్టు వద్ద మైక్ అనౌన్స్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలు తప్పిపోతే మర్రిచెట్టు వద్దకు తీసుకు రావాలని మైక్‌లో అధికారులు భక్తులకు సూచిస్తున్నారు. కొందరు భక్తులు తమకు సంబంధించిన వ్యక్తి కనిపించడం లేదని బండి దగ్గరికి రావాలని.. మర్రిచెట్టు వద్దకు రావాలని... గుట్టపైకి రావాలంటూ వచ్చి అధికారులను విసిగించారు. దీంతో అధికారులు భక్తుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ కేవలం చిన్నపిల్లలు తప్పిపోతేనే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని, ఇలా అధికారులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని పదేపదే సూచించారు.

ఐకేపీ సిబ్బందిని నిర్బంధించిన మహిళలు

- తాము రుణ వాయిదాలు చెల్లించినప్పటికీ బ్యాంక్‌లో వీఓఏ జమ చేయలేదని ఆగ్రహం

మునుగోడు: తాము చెల్లించిన రుణ వాయిదా డబ్బులు బ్యాంక్‌లో జమచేయకుండా సొంతానికి వాడుకున్న వీఓఏతో పాటు ఐకేపీ సిబ్బందిని సోమవారం మునుగోడు మండలం కచలాపురం గ్రామస్తులు నిర్బంధించారు. కచలాపురం గ్రామ వీఓఏగా పనిచేస్తున్న సుఖేందర్ కొంతకాలంగా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన శ్రీనిధి రుణాల వాయిదా డబ్బులు బ్యాంక్‌లో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నట్లు ఐకేపీ అధికారులు గుర్తించారు. దీంతో విచారణ చేపట్టేందుకు ఏపీఎం మహేశ్వర్‌రావు సోమవారం గ్రామంలో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌లో ఎవరు ఎంత చెల్లించారు, వీఓఏ ఎంత జమచేశాడని సభ్యులకు వివరించారు. దీంతో ఆగ్రహించిన మహిళా సంఘాల సభ్యులు వీఓఏతో పాటు ఐకేపీ సిబ్బందిని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మహిళలకు సర్దిచెప్పి ఐకేపీ సిబ్బందిని బయటకు తీసుకొచ్చారు.



ఐకేపీ సిబ్బందిని విడిపిస్తున్న పోలీసులు

రూ. 11లక్షలకు పైగా వాడుకున్న వీఓఏ..

కచలాపురంలోని మహిళా సంఘం సభ్యులు శ్రీనిధి రుణాలు తీసుకుని నెలకు రూ.90వేల వరకు చెల్లిస్తున్నారు. వీఓఏ అందులో ప్రతి నెల రూ.50వేల వరకు మాత్రమే బ్యాంక్‌లో జమచేసి మిగిలిన డబ్బులు సొంతానికి వాడుకున్నాడు. రూ.11 లక్షలకు పైగా వాడుకున్నట్లు ఐకేపీ అధికారులు గుర్తించారు. వీఓఏ నుంచి డబ్బులు రికవరీ చేసి న్యాయం చేస్తామని ఏపీఎం తెలిపారు.

సూర్యాపేటలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు

- వచ్చే నెల 2న ప్రారంభం

మిర్యాలగూడ టౌన్: ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలను మార్చి 2వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు యోగా గురువు పాపిరెడ్డి తెలిపారు. ఈ యోగా పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని యోగా క్లబ్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పోటీలలో 8 ఏళ్ల నుంచి 60 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. 8 నుంచి 12 ఏళ్ల వరకు ఒక గ్రూపు, 13 నుంచి 19 ఏళ్ల వరకు ఒక గ్రూపు, 20 నుంచి 29 ఏళ్ల వరకు ఒక గ్రూపు, 30 నుంచి 39 ఏళ్లు ఒక గ్రూపు, 40 నుంచి 49 ఏళ్ల వరకు ఒక గ్రూపు, 50 నుంచి 59 వరకు ఒక గ్రూపు, 59 నుంచి 60 ఏళ్లు పైబడిన వారికి ఒక గ్రూపుగా విభజించినట్లు పేర్కొన్నారు. 98498 04626 నంబర్‌కు ఫోన్ చేసి ఈ నెల 28వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగా గురువు పాలిశెట్టి లక్ష్మయ్య, యోగా సాధకులు సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, కిశోర్, చిదళ్ల వెంకటేశ్వర్లు, రాచయ్య, నాగయ్య, నర్సింహ్మారావు, మురళి, సరిత, వనజ, అంజయ్య, రమణ పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న యోగా గురువు చాడ పాపిరెడ్డి

తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు ఎవరూ చెరిపేయలేరు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లను చెరిపేయడం ఎవరి తరం కాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద, బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేశామో అక్కడ కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. 15 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై కేసీఆర్ నాయకత్వంలో పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్ యాదవ్, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా తదితరులు పాల్గొన్నారు.

దేశానికి స్ఫూర్తి ప్రదాత కేసీఆర్

మిర్యాలగూడ : దశాబ్దాల పాటు వెనుకబాటుకు గురైన తెలంగాణను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి మాజీ సీఎం కేసీఆర్ దేశానికి స్ఫూర్తి ప్రదాత అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్ల మోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డితో కలిసి జగదీష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, బైరం సంపత్, ఆంగోతు హాతీరాంనాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, లావూరి మేఘ్యానాయక్, ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

మహాకుంభాభిషేక సంప్రోక్షణ వైభవంగా నిర్వహించాలి

- దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగే బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట దేవస్థాన కార్యాలయంలో యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సోమవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ, ప్రొటోకాల్ ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడపడంతో పాటు రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ యాదగిరి క్షేత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటాలన్నారు. అంతకుముందు మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీధర్, పక్కన కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు